

కేటీఆర్‌కు అమ్మవారి జ్ఞాపికను అందజేస్తున్న ఎమ్మెల్యేలు బండ్ల, విజయుడు, ఎమ్మెల్సీ చల్లా

## జోగుళాంబ సన్నిధిలో కేటీఆర్

అలంపూర్, ఏప్రిల్ 23 : అలంపూర్ పట్టణంలోని జోగుళాంబ, బాలబ్రహేశ్వరస్వామి ఆలయాలను బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మంగళవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు, ఈవో పురేందర్‌కుమార్, పాలకమండలి కమిటీ చైర్మన్ చిన్న కృష్ణయ్యానాయుడు స్వాగతం పలకగా ఉభయ ఆలయాల్లో పూజలు చేశారు. అనంతరం కేటీఆర్‌కు స్వామి, అమ్మవార్ల జ్ఞాపిక, శేష వస్త్రాలను ఆలయ ధర్మకర్త వెంకటేశ్వర్‌రెడ్డి అందజేశారు. కార్యక్రమంలో ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్యేలు విజయుడు, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, నాయకులు చల్లా అగస్త్యరెడ్డి, రఘురెడ్డి, గడ్డం కృష్ణారెడ్డి, తిమ్మాపురం నారాయణ, ఆలయ మాజీ చైర్మన్ నారాయణరెడ్డి తదితరులున్నారు.

## అభివృద్ధి బాటలో అలంపూర్..



అలంపూర్ నియోజకవర్గంలో ఎమ్మెల్సీ చల్లాకు విజయుడు ఎడమ భుజమైతే ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కుడి భుజంగా ఉంటాడు. నడిగడ్డ ప్రజలు బీఆర్ఎస్ పార్టీపై అసెంబ్లీ ఎన్నికల్లో చూపిన అభిమానాన్ని ఎంపీ ఎన్నికల్లోనూ చూపుతారని ఆశిస్తున్నా.. అలంపూర్ బిడ్డను గెలిపించి పార్లమెంట్‌కు పంపితే మొట్టమొదటగా శక్తిపీఠమైన జోగుళాంబ, బాలబ్రహ్మేశ్వరస్వామి ఆలయాల అభివృద్ధికి గానూ పురావస్తు శాఖలో నిబంధనల సడలింపునకు కృషి చేస్తాడు. అధికార పార్టీకి దమ్ముంటే ఎన్నికల వేళ ఇచ్చిన హామీ ప్రకారం తుమ్మిళ్ల ఎత్తిపోతల రిజర్వాయర్‌ను పూర్తి చేయాలి. పార్లమెంట్ ఎన్నికల్లో అన్ని విధాలా సమర్థుడైన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు అవకాశం ఇవ్వాలి.

*- సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, మాజీ మంత్రి*

## ప్రజాసేవకే పాలిటిక్స్‌లోకి..



సమాజంలో ఎంతో ఉన్నతస్థాయి ఉద్యోగాన్ని కాదని ప్రజాసేవ చేసేందుకే పాలిటిక్స్‌లోకి వచ్చాను. రాజకీయ హోదా, అధికారం కోసం రాలేదు. ప్రజా గొంతుకను పార్లమెంట్‌లో వినిపించడానికే ఎన్నికల్లో నిల్చున్నా.. కేసీఆర్ హయాంలో గురుకుల విద్యాలయాల కార్యదర్శిగా వేలమంది విద్యార్థుల ఉన్నత చదువులకు శ్రీకారం చుట్టా.. సమాజం అభివృద్ధి చెందాలంటే విద్య, వైద్యం ఉచితంగా అందించాలని కోరుకునే వ్యక్తుల్లో నేను మొదటి వాడిని. తెలంగాణను ప్రపంచపటంలో నిలిపేందుకు కేసీఆర్ ఎంతో కృషి చేశారు. నాపై నమ్మకముంచి పార్లమెంట్‌లో మీ తరపున ప్రశ్నించే అవకాశం ఇవ్వండి. నియోజకవర్గంలో ఎమ్మెల్సీ చల్లా, ఎమ్మెల్యే విజయుడితోపాటు రాబోయే రోజుల్లో నేను కూడా సమస్యల్లో పాలుపంచుకుంటాను.

*- ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, బీఆర్ఎస్ నాగర్‌కర్నూల్ ఎంపీ అభ్యర్థి*

## ఆర్ఎస్పీ అన్నను ఆదరించండి..



అసెంబ్లీ ఎన్నికల్లో నన్ను ఆదరించినట్లుగానే పార్లమెంట్ ఎన్నికల్లో ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలి. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో ఎక్కడా లేనివిధంగా నడిగడ్డ ప్రజలు బీఆర్ఎస్‌కు పట్టం కట్టారు. అందుకు నేను కృతజ్ఞతలు తెలుపుతున్నా. ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, ఎంపీ.. అందరూ ఒకే పార్టీ వారైతే ప్రభుత్వంతో కొట్లాడి సాధించుకోవచ్చు. ప్రతిభావంతుడు, విద్యావంతుడైన ఆర్ఎస్పీ లాంటి వ్యక్తి పార్లమెంట్‌లో ఉంటే మన నిధులు మనం తెచ్చుకునే అవకాశం పుష్కలంగా ఉంటుంది. ఎలాంటి పనులైనా కొట్లాడి సాధించుకోవచ్చు. ప్రశ్నించే గొంతుకకు అవకాశమివ్వండి.

*- విజయుడు, అలంపూర్ ఎమ్మెల్యే*

## 'హస్తం'లో మొదలైన ఆందోళన..



అనుకున్న సమయానికంటే ముందుగానే బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుంది. కాంగ్రెస్ ఒక్క హామీ కూడా సంపూర్ణంగా అమలు చేయలేదు. ఆ పార్టీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ప్రజలకు కష్టాలు మొదలయ్యాయి. గతంలో మాదిరి అన్ని పథకాలు అమలు కావాలంటే మరోసారి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావాలి. ప్రజల అవసరాలు తీర్చే ప్రభుత్వమే కలకాలం అధికారంలో ఉంటుంది. ఇచ్చిన హామీలు అమలు చేయలేక ఇప్పటికే హస్తం నాయకుల్లో ఆందోళన మొదలైంది. ప్రజలు కారు గుర్తుపై ఓటేసి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను పార్లమెంటుకు పంపితే కాంగ్రెస్ నాయకుల్లో మరింత భయం పుట్టుకొస్తుంది. ప్రశ్నించే గొంతుక పార్లమెంట్‌లో ఉంటే మన నియోజకవర్గం మరింత అభివృద్ధి చెందుతుంది.

*- చల్లా వెంకట్రామిరెడ్డి, ఎమ్మెల్సీ*



ఆలింగనం చేసుకున్న కేటీఆర్, ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్


- ఆర్ఎస్పీని పార్లమెంట్‌కు పంపాలి
- బీఆర్ఎస్‌కు 10 సీట్లు కట్టబెడితే రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం
- నిజాయితీ గల మోసగాడు రేవంత్..
- ఇచ్చిన హామీలన్నీ అమలు చేయాలి
- మోదీ అక్షింతలతో రాజకీయం
- కాంగ్రెస్, బీజేపీ దొందూదొందే..
- ప్రజలకు అండగా గులాబీ జెండానే..
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు



సమావేశానికి హాజరైన బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు

# నడిగడ్డ పౌరుషాన్ని చాటాలి

గద్వాల/అలంపూర్/ఉండవెల్లి, ఏప్రిల్ 23 : నడిగడ్డ పౌరుషాన్ని మరోసారి చాటాల్సిన అవసరం వచ్చిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. జోగుళాంబ గద్వాలకు చెందిన ఇద్దరు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీ మొండివారని.. వారు అనుకుంటే ఏదైనా సాధిస్తారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఉమ్మడి పాలమూరు జిల్లాలోని బీఆర్ఎస్ అభ్యర్థులు ఓడిపోయినా.. గద్వాల, అలంపూర్ నుంచి రెండు సీట్లు గెలిచి నడిగడ్డ పౌరుషం, మొండితనాన్ని చాటి చెప్పారన్నారు. ఇదే తరహాలో మరోసారి నడిగడ్డ బిడ్డ ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను అధిక మెజార్టీతో పార్లమెంట్‌కు పంపాలని కోరారు. ప్రజలు భవిష్యత్‌ను ఆలోచించి ఓటు వేయాలని అభ్యర్థించారు. మంగళవారం అలంపూర్ చౌరస్తాలోని ఏజీఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశానికి ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి అధ్యక్షతన వహించారు. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు విజయుడు, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డితో కలిసి ముఖ్యఅతిథిగా కేటీఆర్ హాజరై మాట్లాడారు. రాబోయే ఎంపీ ఎన్నికల్లో 8 నుంచి 10 స్థానాలు బీఆర్ఎస్‌కు వస్తే రాష్ట్రంలో రాజకీయ సంక్షోభం నెలకొంటుందని కేటీఆర్ జోస్యం చెప్పారు. పార్లమెంట్‌లో ప్రశ్నించే గొంతుకగా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నుంచి ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌ను గెలిపిద్దామన్నారు. ఎంపీ ఎన్నికల సందర్భంగా.. పదేండ్ల కేసీఆర్ పాలన చూసి ఓటేస్తారో.. పూటకో అబద్ధం చెప్పే కాంగ్రెసోళ్లకు ఓటు వేస్తారో ప్రజలే తేల్చుకోవాలన్నారు. వారంటీ లేని ఆరు గ్యారెంటీలతో ప్రజలను మోసం చేసి రేవంత్‌రెడ్డి అధికారంలోకి వచ్చారని ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికల్లో 39 స్థానాలు గెలువగా.. 14 స్థానాల్లో స్వల్ప మెజార్టీతో ఓడిపోయామన్నారు. బీఆర్ఎస్ హయాంలో ఎంతోమంది మంత్రులు, ఎంపీలు, డిప్యూటీ సీఎం పదవులు అనుభవించి.. పార్టీ కష్టకాలంలో ఉన్నప్పుడు జారుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు కాంగ్రెసోళ్లు పదవుల ఆశ చూపినా బీఆర్ఎస్‌కు అండగా నిలిచారన్నారు. తెలంగాణ తెచ్చిన కేసీఆర్‌ను కాంగ్రెస్ నాయకులు సూటిపోటి మాటలతో ఇబ్బందులు పెడుతుంటే.. కవితను మోదీ జైల్లో పెట్టించారన్నారు. కేసీఆర్ రాష్ట్రంలో వెయ్యి గురుకులాలను ఏర్పాటు చేస్తే వాటిని ఆర్ఎస్పీ అద్భుతంగా తీర్చిదిద్దారని కొనియాడారు. ప్రస్తుతం బాహుబలి పార్ట్-1, పార్ట్-2 లాగా రేవంత్ హామీలు ఇస్తున్నాడని ఎద్దేవా చేశారు. డిసెంబర్ 9న రుణమాఫీ చేస్తానని చెప్పి ఇంతవరకు చేయలేదన్నారు. మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం తప్పా మరేదీ నెరవేర్చలేదన్నారు. పార్లమెంట్ ఎన్నికల వేళ రేవంత్ పార్ట్ -2 హామీలు ఇస్తున్నారని, వాటి కోసం దేవుళ్లను సాక్షులుగా వాడుకుంటున్నారని విమర్శించారు. రైతుబంధు ఇవ్వలేనోడివి.. ఆగస్టు నాటికి రూ.40వేల కోట్ల రుణమాఫీ ఎలా చేస్తావని ప్రశ్నించారు. కాంగ్రెస్ నాయకుల మాటలు విని ఒకసారి మోసపోవచ్చు కానీ.. రెండోసారి కూడా నమ్మి మోసపోతే తప్పు ప్రజలదేనన్నారు. రేవంత్‌రెడ్డి మోసాలనే అస్త్రాలుగా చేసుకొని ఎంపీ ఎన్నికల్లో గెలవాలని ప్రయత్నిస్తున్నారని, ఆయన తీరు చూస్తే మేం మోసం చేస్తాం.. మోసపోవడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారనే రీతిలో ఉన్నదన్నారు. నిజాయితీ అయిన మోసగాడు రేవంత్‌రెడ్డి అని కితాబిచ్చారు. 420 హామీలతో రేవంత్ గద్దెనెక్కాడన్నారు. లంకెబిందెలుంటాయి.. దోచుకెళ్దామని వస్తే అన్నీ ఖాళీ బిందెలే ఉన్నాయని రేవంత్ నిరాశ చెందాడన్నారు. సీఎం దొంగలాగ జేబులో కత్తెర పెట్టుకొని ఎప్పుడు ఎవరి జేబు కట్ చేయాలని ఆలోచిస్తున్నాడన్నారు. ముఖ్యమంత్రి మహబూబ్‌నగర్‌లో ప్రచారానికి వచ్చిన సమయంలో తెలంగాణ తెచ్చిన వ్యక్తి, మాజీ ముఖ్యమంత్రి అని కూడా చూడకుండా కేసీఆర్‌ను నానా బూతులు మాట్లాడాడని.. కేసీఆర్ మగాడైతే పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు గెలవాలని సవాలు విసిరిన సందర్భాన్ని కేటీఆర్ గుర్తు చేశారు. ''సీఎంకు నేను సవాలు విసురుతున్నా.. నీవు మగాడివైతే.. రైతుబంధు ఇవ్వు, నీవు మగాడివైతే.. రూ.40వేల కోట్ల రుణమాఫీ చెయ్.. నీవు మగాడివైతే.. ఆసరా పింఛన్లు పెంచి వారికి చేయూతనివ్వు, నీవు మగాడివైతే.. మహిళలకు నెలకు రూ.2,500ల హామీ అమలు చెయ్.. ఆ తర్వాత ఇతరుల గురించి మాట్లాడు..' అని హితవు పలికారు. దేవుళ్ల సాక్షిగా ముఖ్యమంత్రి అబద్ధాలు చెబుతున్నాడని ఆరోపించారు. కేసీఆర్ పదేళ్ల పాలనలో పాలమూరుకు వలసొచ్చినోళ్లు ఏనాడూ సాగు, తాగునీటికి ఇబ్బందులు పడలేదు. రైతుబంధు, ఉచిత కరెంట్ సరఫరాలో ఎలాంటి ఇబ్బంది లేదు. కానీ ఇప్పుడు ఎక్కడ చూసినా రైతుబంధు డబ్బులు పడ్డాయా అని ప్రజలు చర్చించుకుంటున్నారన్నారు. గత ప్రభుత్వం 30వేల ఉద్యోగాలకు నోటిఫికేషన్ ఇచ్చి రిజల్ట్ ఇస్తే.. 100 రోజుల్లో మేం ఉద్యోగాలిచ్చామని రేవంత్ అండ్ కో ప్రగల్భాలు పలుకుతున్నారన్నారు. మోదీ తెలంగాణకు ఏం చేశాడని ప్రశ్నించారు. బీజేపీ పాలనలో పాలమూరు జిల్లాకు ఒక మెడికల్ కాలేజ్ కాని నవోదయ, సైనిక పాఠశాల మంజూరు చేశాడా అని ప్రశ్నించారు. తెలంగాణలో జిల్లాకో మెడికల్ కళాశాల ఏర్పాటు చేసిన ఘనత కేసీఆర్‌దేనన్నారు. మోదీ రాముడిని చూపి ఓట్లు దండుకోవాలని ప్రయత్నిస్తున్నాడన్నారు. దేశవ్యాప్తంగా మోదీ అంక్షింతలు పంపిణీ చేస్తే.. ఈ పదేళ్లలో కేసీఆర్ దేశానికే అన్నపూర్ణగా తెలంగాణను తీర్చిదిద్దాడని.. కేసీఆర్ ప్రభుత్వం మూడున్నర కోట్ల ధాన్యాన్ని దేశానికి ఇవ్వడమే అందుకు ఉదాహరణన్నారు. ఇదంతా కేసీఆర్ ఘనతనేనని కొనియాడారు. మనమందరం హిందువులం.. అందరు దేవుళ్లను పూజిస్తామన్నారు. పేదల జనధన్ ఖాతాలో రూ.15లక్షలు వేస్తానని చెప్పి ఒక్కరికైనా వేశాడా అని ప్రశ్నించారు. కృష్ణా జలాల్లో తెలంగాణ వాటా తేల్చాలని పదేండ్లుగా అడుగుతున్నా మోదీ పట్టించుకోవడం లేదన్నారు. బీజేపీ అధికారంలోకి వస్తే రెండుకోట్ల ఉద్యోగాలిస్తామని చెప్పారు.. ఎక్కడిచ్చారో చూపెట్టాలని డిమాండ్ చేశారు. రైతుల ఆదాయం రెట్టింపు చేస్తానన్న మోదీ నల్లచట్టాలను తీసుకొచ్చి కార్పొరేట్ శక్తులకు కొమ్ము కాస్తూ రైతుల కష్టాలను రెట్టింపు చేశాడని విమర్శించారు. పేదలకు ఎల్లప్పుడు గులాబీ జెండా అండగా ఉంటుందన్నారు. ప్రవీణ్‌కుమార్ సమర్థవంతమైన వ్యక్తి అని.. అతడిని గెలిపిస్తే నడిగడ్డ సమస్యలు పార్లమెంట్‌లో ప్రస్తావించడానికి అవకాశం ఉంటుందన్నారు. ఇకపై ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ కాదు.. బీఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ అని కేటీఆర్ పేర్కొన్నారు. సమావేశంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కృష్ణమోహన్‌రెడ్డి, విజయుడు, ఎమ్మెల్సీ చల్లా వెంకట్రామిరెడ్డి, పార్లమెంట్ నియోజకవర్గ ఇన్‌చార్జీలు దేవర మల్లప్ప, అభిలాష్ రావు, బైకని శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.



కేటీఆర్‌తో కరచాలనం చేస్తున్న బండ్ల, చిత్రంలో విజయుడు



పార్టీలో చేరిన వారికి బీఆర్ఎస్ కండువాలను కప్పుతున్న మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

# విజయవంతం చేయాలి

- 26న మహబూబ్‌నగర్‌లో కేసీఆర్ పర్యటన : మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్

మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 23 : మహబూబ్‌నగర్‌లో ఈనెల 26న నిర్వహించే బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ పర్యటనను విజయవంతం చేయాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని న్యూటౌన్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సన్నాహక సమావేశానికి ఆయన హాజరై మాట్లాడారు. రోడ్ షోతో పాటు క్లాక్ టవర్‌లో నిర్వహించే సమావేశంలో కేసీఆర్ పాల్గొంటారన్నారు. గ్రామాల నుంచి స్వచ్ఛందంగా సభకు వచ్చేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. కాంగ్రెస్ ప్రజల్లో విశ్వాసం కోల్పోయిందని, అన్ని వర్గాలు సర్కారుపై గుర్రుగా ఉన్నారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కు పట్టం కట్టేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని చెప్పారు.

### కారెక్కిన కమలం, కాంగ్రెస్ నేతలు

హన్వాడ మండలం తిరుమలగిరికి చెందిన 100 మంది కాంగ్రెస్, బీజేపీ నాయకులు, కార్యకర్తలు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ సమక్షంలో బీఆర్ఎస్‌లో చేరారు. కార్యక్రమంలో గ్రంథాలయాల సంస్థ మాజీ చైర్మన్ రాజేశ్వర్‌గౌడ్, కార్పొరేషన్ మాజీ చైర్మన్ వెంకటేశ్‌గుప్తా, రాజేశ్వర్‌గౌడ్, నాయకులు మల్లు నర్సింహారెడ్డి, రవీందర్‌రెడ్డి, రాఘువేందర్, ఆంజనేయులు పాల్గొన్నారు.



మంగళవారం ఓ టీవీ ఛానల్ నిర్వహించిన ఇంటర్వ్యూకు బీఆర్ఎస్ అధినేత, తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ హాజరయ్యారు. ఈ కార్యక్రమాన్నిమహబూబ్‌నగర్‌లోని పలు కాలనీల ప్రజలు టీవీల్లో వీక్షించారు. సుమారు 14 ఏండ్ల తర్వాత కేసీఆర్ లైవ్ షోకు హాజరవడంతో బీఆర్ఎస్ శ్రేణులు, కేసీఆర్ అభిమానులు సాయంత్రానికల్లా పనులు ముగించుకొని టీవీలకు హత్తుకుపోయారు. 2014కు ముందు.. గత డిసెంబర్ వరకు వచ్చిన మార్పును కేసీఆర్ వివరిస్తుంటే చప్పట్లు, కేరింతలతో అభిమానాన్ని చాటుకున్నారు.

*- మహబూబ్‌నగర్ అర్బన్, ఏప్రిల్ 23*

# మోసకారి కాంగ్రెస్‌ను తరిమికొడుదాం

- పార్లమెంట్ ఎన్నికల్లో రాష్ట్రంలో 12 సీట్లు గెలుస్తాం
- బీఆర్ఎస్ పాలమూరు జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి

మిడ్జిల్, ఏప్రిల్ 23 : అమలుకాని హామీలతో.. వ్యక్తిగత విమర్శలతో పాలనను గాలికొదిలేసిన మోసకారి కాంగ్రెస్‌ను ప్రజలు తరమికొట్టే రోజులు దగ్గర్లోనే ఉన్నాయని, ఎంపీ ఎన్నికల్లో గులాబీ జెండా ఎగురవేసేందుకు నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని బీఆర్ఎస్ పాలమూరు జిల్లా అధ్యక్షుడు లక్ష్మారెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ఏవీఎస్ గార్డెన్‌లో బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పాండు అధ్యక్షతన ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సమావేశానికి ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా లక్ష్మారెడ్డి మాట్లాడుతూ కొత్తగా వచ్చిన సర్వే ప్రకారం 10 నుంచి 12 స్థానాల్లో బీఆర్ఎస్ గెలుపు ఖాయమన్నారు. గ్రామ స్థాయి నుంచి కార్యకర్తలు ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి గెలుపు కోసం సమిష్టిగా కృషి చేయలన్నారు. ఈనెల 26న మహబుబ్‌నగర్‌లో గులాబీ బాస్ కేసీఆర్ రోడ్ షోకు పెద్ద ఎత్తున కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో ఎంపీపీ సుదర్శన్, నాయకులు సుధాబాల్‌రెడ్డి, జంగిరెడ్డి, జైపాల్‌రెడ్డి, బాలు, శ్రీనివాస్‌గౌడ్, ఎల్లయ్యయాదవ్, ప్రతాప్‌రెడ్డి, శ్రీనివాసులు, బంగారు, బీమ్‌రాజు, సుకుమార్, మల్లేశ్, నవీనాచారి, జగన్‌గౌడ్, రవికుమార్ తదితరులు పాల్గొన్నారు.



## నిలువునా ముంచుతున్నారు..

డిసెంబర్ 9న రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని ప్రజలను నమ్మించి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. బీఆర్ఎస్ సర్కారు ఇచ్చిన రైతుబంధుకు ఎగనామం పెట్టింది. అంతేకాకుండా రైతులు అరిగోస పడుతుంటే కనీసం పట్టించుకున్న పాపాన పోలేదు. ఆగస్టులో రుణమాఫీ చేస్తామని మరోసారి మోసం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. ప్రభుత్వం ఏర్పడిన వందరోజుల్లోనే హామీలన్నీ అమలు చేస్తామని చెప్పి నిలువునా ముంచారు. కేసీఆర్ ప్రభుత్వం వ్యవసాయ రంగానికి అత్యధిక ప్రాధాన్యమిచ్చింది. 24 గంటల కరెంటు, రైతుబంధు, రైతుబీమా ఇలా అన్ని విధాలా అండగా నిలిచారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాలుగు నెలల్లోనే కరువు తెచ్చారు. పదేండ్లు బీజేపీ కేంద్రంలో అధికారంలో ఉండి తెలంగాణకు చేసిందేమీ లేదు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఆదరించి గెలిపించాలి.

*- మన్నె శ్రీనివాస్‌రెడ్డి, మహబూబ్‌నగర్ ఎంపీ*

# సలేశ్వరం.. జనసంద్రం

అచ్చంపేట, ఏప్రిల్ 23 : చైత్ర పౌర్ణమిని పురస్కరించుకొని మంగళవారం సలేశ్వరానికి భక్తులు పోటెత్తారు. లింగమయ్యను దర్శించుకొని పూజలు చేశారు. శ్రీశైలం రహదారిలో రద్దీ నెలకొనగా భక్తులు ఇబ్బందులు పడ్డారు. దారి పొడవునా స్వచ్ఛంద సంస్థలు అన్నదానం, అంబలి, చలివేంద్రాలు ఏర్పాటు చేశారు. వేసవి తాపం పెరిగినా లింగమయ్యను చూసేందుకు లక్షల సంఖ్యలో భక్తులు తరలిరాగా చెంచులే పూజారులుగా వ్యవహరించి స్వామికి పూజలు చేశారు. వస్తున్నాం లింగమయ్యా.. వెళ్లొస్తాం లింగమయ్యా.. అంటూ భక్తుల నినాదాలతో అటవీ ప్రాంతమంతా మార్మోగింది. బుధవారంతో ఉత్సవాలు ముగియనున్నాయి. ఎస్పీ గైక్వాడ్ వైభవ్ రఘునాథ్ ఆదేశాల మేరకు అచ్చంపేట డీఎస్పీ శ్రీనివాసులు ఆధ్వర్యంలో పోలీసులతో భారీ భద్రతా చర్యలు చేపట్టగా అటవీశాఖ ఆధ్వర్యంలో వలంటీర్లను నియమించారు. రాంపూర్ పార్కింగ్ స్థలం వద్ద పడేసిన ప్లాస్టిక్ వ్యర్థాలను వలంటీర్లు సేకరించి మన్ననూర్‌లోని రిసైకిల్ షెడ్డుకు తరలించారు. దాదాపు మూడు ట్రాక్టర్ల ప్లాస్టిక్ వ్యర్థాలను సేకరించినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.



స్వామి దర్శనానికి బారులుదీరిన భక్తులు

## ఐదోరోజు 16 నామినేషన్లు

మహబూబ్‌నగర్, ఏప్రిల్ 23 (నమస్తే తెలంగాణ ప్రతినిధి): మహబూబ్‌నగర్ లోకసభ స్థానానికి ఐదో రోజు ఆరుగురు అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. మంగళవారం పాలమూరు కలెక్టరేట్‌లో రిటర్నింగ్ అధికారి రవినాయక్‌కు అభ్యర్థులు నామినేషన్ పత్రాలను అందజేశారు. ఆరుగురు ఏడు సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. ధర్మసమాజ్ పార్టీ అభ్యర్థిగా జి.రాకేశ్, స్వతంత్ర అభ్యర్థి మల్లెల హరిందర్, టి.విష్ణువర్ధన్‌రెడ్డి, అనీసుర్ రహమాన్, కారుకొండ శ్రీనివాసులు, హనుమేశ్ నామినేషన్ వేశారు.

***కందనూలులో పది..***

నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానానికి 10 నామినేషన్లు దాఖలయ్యాయి. స్వతంత్ర అభ్యర్థులుగా గాలిముడి గీత, పిల్లేల శ్రీకాంత్, పాలాది నాగరాజు, లంద భిక్షపతి, నేడిగొండ కృష్ణయ్య, కాంగ్రెస్ అభ్యర్థి మల్లు రవి, అలయన్స్ ఆఫ్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ పార్టీ (ఆదార్‌పార్టీ) అభ్యర్థి అంబోజు రవి తరపున దయాకర్, చిరుతైగల్ కచ్చి పార్టీ అభ్యర్థిగా భారతి దాసరి నామినేషన్ పత్రాలను రిటర్నింగ్ అధికారి ఉదయ్‌కుమార్‌కు అందజేశారు. సోషల్ మీడియా స్టార్‌గా పేరు తెచ్చుకున్న శిరీష అలియాస్ బర్రెలక్క కూడా నాగర్‌కర్నూల్ పార్లమెంట్ స్థానానికి నామినేషన్ వేశారు.

## మాడు పగులుతోంది..

- కేతేపల్లిలో 44.3 డిగ్రీలు నమోదు

పాన్‌గల్/వడ్డేపల్లి, ఏప్రిల్ 23 : గతంలో ఎన్నడూ లేనివిధంగా భానుడు సెగలు కక్కుతున్నాడు. 20రోజులుగా ఉమ్మడి జిల్లాలో ఎండలు మాడు పగులగొడుతున్నాయి. ఉదయం 11గంటలు దాటితే ప్రజలు ఇండ్లకే పరిమితమవుతున్నారు. ఎండల తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు కూల్‌డ్రింక్స్, వాటర్ బాటిల్స్, టెంకాయ నీళ్లు, మజ్జిగ, జ్యూస్ షాపులకు ఎగబడుతున్నారు. ఈక్రమంలో మంగళవారం వనపర్తి జిల్లా పాన్‌గల్ మండలం కేతేపల్లిలో రికార్డు స్థాయిలో 44.3 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. నాగర్‌కర్నూల్ జిల్లా కిష్టంపల్లిలో 43.8, మహబూబ్‌నగర్ జిల్లా సల్కర్‌పేటలో 43.6, గద్వాల జిల్లా వడ్డేపల్లి మండలంలోనూ 43.5, నారాయణపేట జిల్లా ధన్వాడలో 43 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. ఎండ వేడిమికి తాళలేక అల్లాడిపోయారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు.